# ఆకాశం ఇంత విశాలంగా ఎందుకుంది?

సత్యమూర్తి గొప్ప వ్యవహార జ్ఞానమున్నవాడు. బహు మేధావి. లాభం లేనిది ఏ పనీ తలపెట్టడు. అది ఆర్థికంగానూ కావొచ్చు, మానసికపరమైనదీ కావొచ్చు. ఈ విషయంలో ఇతరుల బాధలు, కష్టాలు, నష్టాలు అతనికి వంట బట్టవు. అతని తృప్తే తృప్తి.

అందుకు ఏ కించిత్తు కష్టం సంభవించినా అణచుకోలేని బాధ అతనిలోంచి పెల్లుబుకుతుంది. దాన్ని అతను సహించలేడు. ఆ బాధ తీరేవరకూ నిద్రపోడు. నిద్రపోతే, సత్యమూర్తి పూర్తి నిద్రలోకి తరలిపోవలసిందే. ఇంతటి పట్టుదల మనిషికి ఉండకూడదు. కాని అదే అతని జీవితమయింది.

వాళ్ళ బాటిలింగ్ కంపెనీలోని డ్రైవర్ కమ్ సేల్స్‌మన్ రాజు మంచివాడే. కాని అతను చేసిన చిన్న పొరపాటు మేనేజింగ్ డైరెక్టరు సత్యమూర్తిని దహించి వేసింది. కళ్ళు ఎర్రబడిపోయాయి. పళ్ళు బిగిసిపోయాయి. పెదవి చలించింది. ఆ చేష్ట - డ్రైవరు రాజు చేసిన ఆ అసందర్భపు ప్రేలాపన - అందులో తనను ఎంతగానో గౌరవించే డీలరు ముందు - శరీరం వూగిపోయింది. 'వీడి పని పట్టాలి.' మనసు కెవ్వున అరిచింది. 'వీడిని సర్వనాశనం చేసిగాని వదలకూడదు.'

ఆ ఊహ ప్రళయంగా విచ్ఛిన్నమై, శిరోవేదనై విజృంభించింది.

మనసు ఏ పనిమీదకీ పోవడం లేదు. ఇంతటి అవిధేయతను తన శరీరం తట్టుకోలేదు. తొందరగానే శిక్షించాలి. 'వాడికి శిక్ష - తన మనసుకు శాంతి' ఇదే తన కోరిక.

వాడికి తెలియకుండా వాణ్ణి శిక్షించాలి. క్రమంగా కొన్నాళ్ళకుగాని వాడికా శిక్ష ఫలానా అందుకు పడిందని తెలియకూడదు. అప్పుడు వాడు తన గుండెల్లో కుమిలి కుమిలి దహించుకునిపోవాలి. నిలువునా ఆ మంటల్లో వాడు బూడిద కావాలి. ఒకటి

- ఉద్యోగం ఊడిపోవడం. రెండు - గుండెల్నిండా పొగలు జిమ్మే బాధ. అంతేజరగాలి. లేకపోతే 'మేనేజింగ్ డైరెక్టర్ సత్యమూర్తిగారు చెప్పినా నీకు సరుకు దింపేది లేదు ' అంటాడా? ఎన్ని గుండెలు? ఆ డీలరు - సాలూరు బుగత - అంతగా బతిమాలినా మీ ఎం.డి.కి నేను చెప్తాను, నీకేం భయంలేదు అని అంటున్నా ఎన్ని అనవసరమైన మాటలన్నాడు! వాడిలో తన మీద అక్కసు వుంది. అట్టడుగువానికి తన యజమాని మీద, అందులో నిజాయితీపరుడైన యజమాని మీద ఎందుకు ఆ అక్కసు? వాడి మొహం వాడు పెద్ద మొనగాడై పోయినట్టు! వాడికీ కొన్ని ప్రిన్స్‌పల్స్...? "ఇవాళ చాలా అర్జంటు. సరుకు నాకు దింపెయ్... సత్యమూర్తి గారికి నేను ఫోను చేసి చెప్తాను. నీకే యిబ్బందీ ఉండదు'' అంటున్నా "ఆ సరుకు వేరే వారికి ఇవ్వడానికి బయలుదేరాను. కాదు నేను బయలుదేరలేదు. వాళ్ళే బయలుదేర తీశారు. మధ్యలో ఈ అడ్డగోళ్ళ వ్యవహారమేమిటి? ఎవరికి ఇమ్మన్నారో వాళ్ళకే ఇస్తాను. మధ్యలో నువ్వెవరివయ్యా తంపటంలా... ఆ డీలరుమాత్రం నీలాటివాడు కాడేమిటి? డబ్బంతా కట్టి అతను కొనుక్కుంటే మధ్య నువ్వేమిటి అడ్డు తగుల్తావు? నీకు మా సత్యమూర్తి గారు చెప్పినా యివ్వను.'' అంటూ విసురుగా సవాలు చేస్తున్నట్టే అన్నాడు.

"ఒరేయ్... మాకు డబ్బు గురించిన బాధలేదు. నువ్వే మాట్లాడు ఫోను. మీ సత్యమూర్తిగారు ఇమ్మంటేనే ఇయ్యి.నిమిషాల మీద ఫోను వచ్చేస్తుంది. వైజాగే కదా... ఆపరేటర్లందరూ తెలిసినవాళ్ళు. క్షణాలమీద కాల్ వచ్చేస్తుంది. సరుకు వాళ్ళకు రేపు ఇవ్వొచ్చు. ఆగు'' అంటూనే ఉన్నాడట.

"ఈ యవ్వారంలో సత్యమూర్తిగారెవరయ్యా మధ్య. ఇలాంటి పని ఆయన చెయ్యమన్నా చెయ్యను. చెప్పుకో నీ తాతతో'' అంటూ వెళ్ళిపోయాడట.

"చెప్పుకో నీ తాతతో'' ఈ పనికి మాలిన మాట సత్యమూర్తి గుండెల్ని దహించివేస్తోంది. చిన్న చీమలాంటివాడు, నోరెత్తడానికి వీలులేనివాడు అంతమాట అనడమా... నో... నో... ముందు ఈ అవిధేయతకు శిక్షపడాలి. అప్పుడుకాని తన మనసు శాంతించదు. ముందు వాడు చేసిన పని సమంజసమైనదా, కాదా... అని కాదు, ఆ మాట, దాని తీరు చూస్తూవుంటే ఏ మాత్రం సహించడానికీ వీలేలేనట్లుగా ఉంది. మరీ ఘోరం ఆ సాలూరు బుగత రాజును తనముందు నిలబెట్టి నిలదీసినప్పుడు, 'తప్పుపని మా సత్యమూర్తిగారు చెయ్యమనరు. ఒకవేళ ఆయన అన్నా నేచేయను... చెప్పుకో నీ తాతతో...!'' అని అన్నట్టు తన ముఖంమీదే అన్నాడు. ఇది మరీ అన్యాయం. ఏదో పొరపాటై పోయింది అంటే సరిపోయేది.

సాలూరు బుగతకూ, తనకూ ఎంతో స్నేహమున్నట్లు రాజుకు తెలుసు. తెలిసి కూడా ఇలా చేయడం, రాజు అంతరాంతరాల్లో తనను లోకువ చేయాలనే... అందులో పెద్దల ముందు తనను అవహేళన చేయాలనే లక్షణమే కనిపిస్తోంది. ఇలాంటివాడు ఉండతగడు. ఇలాంటి బుద్ధి హర్షించతగ్గది కాదు. ముందు ఇలాంటి వాణ్ణి ఏరిపారెయ్యక పోతే, మిగిలిన పనివాళ్లూ బరితెగిస్తారు. ఎడ్మినిస్ట్రేషన్ పూర్తిగా దెబ్బతింటుంది. అంచేత వీడిపని పట్టాలి. ఇందుకే శిక్షిస్తున్నట్టు తెలియకుండా శిక్షించాలి. అప్పుడు మిగిలిన వాళ్ళు ఒళ్ళు దగ్గరుంచుకుంటారు, అనుకున్నాడు.

కాని ఏమిచేస్తే ఇంతపని కరెక్ట్‌గా జరుగుతుందో... అన్నది ఊహాపథంలో తేలిచావడం లేదు. ఎలా శిక్షించాలి? అద్భుతమైన శిక్షపడాలి. కళ్ళు తేలిపోవాలి. ఒక్కసారి ఒళ్ళు జలదరించాలి. అబ్బా ఇంతలోతైన ఆలోచనా! అనుకోవాలి. అప్పుడుకాని తన మనసు కుదుటపడదు.

సత్యమూర్తికి నిద్ర రావడంలేదు. ఆలోచన తెమలడంలేదు. తను ఎన్నెన్నో గొప్ప పనులు చేశాడు. చిన్నప్పటినుంచీ తను హీరో. తన పెళ్ళి విషయంలోనే తను మహాద్భుతమైన తెలివిని ప్రదర్శించాడు. ఆవిడ యిప్పటికీ ఆ సంఘటన మరిచిపోదు. అసలు ఆ సంఘటన ప్రపంచంలోనే ఎవ్వరూ మరచిపోలేరు.

సరోజ తన మేనమామతో సినిమాకు స్కూటరుమీద బయలుదేరి, టిక్కెట్లు దొరక్క ఇంటికి చిరాగ్గా తిరిగి వెళ్ళిపోతూవుంది. మేనమామను చిన్నచిన్న చివాట్లు వేస్తూనే వుంది. 'నీ మొహం నీకేమీ చాతకాదు' అనడం అతనికి వినిపించింది. క్షణంలో ఎదురుగా వస్తూన్న అతని బుల్లెట్ వాళ్ళ స్కూటరు పక్క ఆగడం "ఏం వెళ్ళిపోతున్నారు ?"అని అతను అనడం జరిగిపోయింది. సరోజ ముఖం మీద నరాలు విరిగిపోతున్నట్లున్నాయి. "ఈయనగారు టిక్కెట్లు కూడా సంపాదించలేని మొనగాడు, ఆఫ్టాల్ సినిమా టిక్కెట్లు" అంది. ఆ మాటలో ఎన్నెన్నో అర్థాలు సులువుగానే ఊహించగలిగిన సత్యమూర్తి "అదేమిటి! నే తెస్తాను రండి..." అన్నాడు. వెంటనే సరోజ మేనమామ - అతనూ పాతికేళ్ళవాడే - "బుకింగ్ క్లోజండీ..." అన్నాడు, "ఆఫీసర్ల టిక్కెట్లుంటాయి. లేకపోతే ఎక్స్‌ట్రా ఛైర్స్ వేయిస్తాను. సరోజ మొదటి రోజునే చూడాలి" అన్నాడు. "వద్దులెండి. ఎక్స్‌ట్రా ఛైర్స్ నాకిష్టముండదు" అంది.

"కాదు, ఇవ్వాళ మీరీ ఆట తప్పక చూస్తారు, అందులో ఏతేడా ఉండదు" అన్నాడు. "అయితే, మీరు వెళ్ళండి." అంటూ మేనమామ సరోజవైపు చూశాడు. సరోజ సత్యమూర్తితో సినిమా చూసేందుకు సిద్ధమైనట్లుంది. ఉండడమేమిటి

సత్యమూర్తి బుల్లెట్ మీద కూర్చోవడానికి వచ్చేసింది.

మేనమామ దిగాలుగా యింటికి దారి తీశాడు.

అతను తిన్నగా థియేటరు యజమానిని కలుసుకున్నాడు. ఆఫీసర్లు రాకపోవడం వల్ల ఆ టిక్కెట్లూ అమ్మకం అయిపోయినట్లు తెలిసింది.

సరోజను ఒకసారి చూశాడు. సరోజ ఎంత గొప్ప వారింటిబిడ్డో క్షణాల మీద అంచనా వేసేసుకున్నాడు. థియేటరు యజమానిని పక్కకు పిలిచాడు. ఏమి మాట్లాడాడో ఏమో... పది నిముషాలలో వీధిలో ఓ బోర్డు వేలాడింది. "ఈ రోజున మొదటి ఆట అనివార్య కారణాలవల్ల ప్రదర్శించలేక పోతున్నాం. మీరు కొన్న టిక్కెట్లు రెండవ ఆటకు చెల్లుతాయి. అకారణంగా వచ్చిన కష్టాలవల్ల ఈ ఇబ్బంది క్షమించండి" అని. చేసేది లేక ప్రజలు తిట్టుకుంటూ, రెండవ ఆటకు రాలేని వారు టిక్కెట్లు అమ్మేసుకుంటూ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

మొత్తం సరోజ, సత్యమూర్తి ఇద్దరే ఆ ఆటను ఆ వేళ కనులారా చూశారు. రెండు ఆటల డబ్బు అప్పటికప్పుడు థియేటరు యజమానికిచ్చివేసి ప్రదర్శన జయప్రదం చేశాడు. ఆ థ్రిల్ సరోజ గుండెల్లో ఆపార ప్రేమానురాగాలను మొలకెత్తించింది. తరువాత సరోజతో పెళ్ళి. గొప్ప ఆస్తి, ఎంతో సుఖం పెనవేసుకొని అతని వాకిట నిలిచాయి. ఆపైన ఈ విషయం తెలిసిన మామ కోటయ్య నాయుడుగారు అతన్ని బహు మేధావిగా నిర్ణయించుకున్నారు. కొత్త కంపెనీ మెషీన్ టూల్స్ వ్యవహారాలు చూడమని అతన్ని నియమించారు.

ఇందులోనూ ఓ అద్భుతాన్ని సాధించాడతను. భారత దేశమంతటా ఈ కొత్త కంపెనీ ఎడ్వర్‌టైజ్ కావాలి. అప్పుడుకాని సేల్స్ అందుకోవు. ఒక వారం రోజుల్లో మొత్తం దేశమంతా అన్ని దినపత్రికల్లోను, బహుళ ప్రచారమున్న వారపత్రికల్లోనూ అడ్వర్‌టైజ్ కావాలని మామగారు నిర్ణయించారు. ఈపనికి లక్షల మీద డబ్బు ఖర్చు చేయవలసి వుంది. వెంటనే అతను, "ఎందుకండీ అంత ఖర్చు. పైసా ఖర్చు కాకుండా అంత విలువా సాధిస్తాను. చూస్తూ ఉండండి" అన్నాడు.

మామగారు "ఏమి చేస్తావయ్యా" అన్నారు. అతన్ని శంకించలేదు. అతనిమీద గొప్పనమ్మకం.

ఆఫీసులో మూడో రోజున దొంగలు పడ్డారు. కాని, ఏమీ పోలేదు. ఇనప్పెట్టెలోని లక్షాయాభైవేలు చెక్కుచెదరకుండా అలాగే ఉన్నాయి. ఇనప్పెట్టెను తెరవడానికి దొంగలు ఆక్సీ ఎసటలీన్ ఫ్లేమ్ కూడా ఉపయోగించారు. వాచ్‌మన్‌ను ఓ స్తంభానికి

కట్టివేసి మారు తాళాలతో తెరవడానికి ప్రయత్నించారు. కాని ఆ ఫైర్ ప్రూఫ్ సేఫ్ వాళ్ళకు లొంగలేదు. నిజంగా సేఫ్ తయారు చేసిన కంపెనీవారిదికదా ఆ క్రెడిట్. అదే భావాన్ని వ్యక్తంచేస్తూ అతను, తమ ఆఫీసు లెటర్‌హెడ్‌మీద నైస్‌గా టైపు చేయించి, ఆ కంపెనీ వారిని అభినందిస్తూ, తమ డబ్బును అన్యాక్రాంతం కానివ్వని ఆ సేఫ్‌కు ధన్యవాదాలర్పిస్తూ ఓ చిన్న ఉత్తరం రాశాడు.

అంతే - వారం రోజులు తిరక్కుండానే ఆ ఇనప్పెట్టెల కంపెనీ వారు అతను రాసిన ఉత్తరాన్ని ఫోటో ప్రింట్ తీసి బ్లాకుగా మలచి తమ ఎడ్వర్టయిజ్‌మెంట్‌లో నైస్‌గా ఇరికించి ప్రచురించారు. దేశంలోని అన్ని దిశల్లోని పత్రికల్లోనూ అడ్వర్‌టైజ్ చేశారు.

దీనితో అనుకున్న పని పూర్తి అయింది. ఆ లెటర్‌హెడ్‌లో తమ కంపెనీ ఎక్కడ ఉన్నదీ, ఏమేమి తయారు చేసేదీ పూర్తి వివరాలు ఉన్నాయి. వారం రోజులు తిరక్కుండా తమ కంపెనీకి కొల్లలుగా దేశంలోని అన్ని మూలల నుంచి ఎంక్వయిరీస్ వచ్చిపడ్డాయి.

మామగారు అతని ప్రజ్ఞకు దిగ్భ్రాంతి చెందారు. ఎంతగానో అభినందించారు.

కానీ ఖర్చు కాకుండా లక్షలు కలిసొచ్చే పనులు చేయగలిగిన అతనికి ఈ డ్రైవరు రాజు విషయం మనసును వేధించేస్తోంది. ఇది అతను భరించలేడు.

లీగల్ ఎవేజన్ చేసి తమ కంపెనీకి లక్షలు లక్షలు ఆర్జించి పెట్టాడు. ఇవి చెప్పుకోడానికి బాగుండవు కాని డైరెక్టర్లందరూ కథలు కథలుగా చెప్పుకుంటూ, తనను రకరకాలుగా ప్రశ్నిస్తూ, తను చేసిన పనులు తనకే చెప్తూ రకరకాలుగా ఉవ్విళ్ళూరిస్తున్నప్పుడు, "ఎలా వస్తాయయ్యా ఇలాంటి ఊహలు..." అన్నప్పుడు అతనికి కలిగే ఆనందం చెప్పలేనిది కదా... అందులో మామగారు మరీను.

అతను పడుతూన్న ఈ బాధ చూడలేక మామగారు రెస్క్యూలోకి వచ్చారు. అతని ఆవేదన అర్థమై, "నీకెందుకయ్యా ఇంత బాధ. వాడిపని నేను చూసుకుంటాను. నాకు వదిలెయ్యి. వాడ్ని ఏడేడు చెరువుల నీళ్ళూ నేను తాగిస్తాను..." అన్నారు. కాని మామగారికి ఈ క్రెడిట్ దక్కనివ్వడం అతనికి సుతరాం ఇష్టం లేదు. తన జీవితానికి ఫెయిల్యూరు ఉండకూడదు. మరీ హార్ట్‌కు తీసుకోవడంవల్లనే ఈ విషయమై సరియైన ఆలోచన కుదరడంలేదు. సరిగ్గా అప్పుడే చప్పున ఓ ఐడియా స్ఫురించింది. "ఆగండి మామగారూ.. .నేనే వాడి పని పడ్తాను" అన్నాడు.

సత్యమూర్తి ఎయిర్‌లో హైదరాబాదు నుంచి వైజాగ్ వచ్చాడు. లారీ లోడ్ చేయించుకుంటూన్న డ్రైవర్ రాజు కనిపించాడు.

గతం అంతా ఏ మాత్రం గుర్తు లేనట్టుగా, "ఏమోయ్ రాజూ... ఏమిటి అలా చిక్కిపోయావ్... అదే - నీ వరస ససేమీ బాగులేదు. టి.ఎ. కోసం రేయింబవళ్ళు త్రిప్పులు పడేట్టు చూసుకుంటున్నావ్. ఆ ఇదేమిటి... ఇంత నీరసంగా కనిపిస్తున్నావు. ఉండు, డాక్టరుకు చీటీ యిస్తాను. పట్టుకెళ్ళి ఒళ్ళు చూపించుకో. ఆరోగ్యం లేనిది మనం ఎంత సంపాదిస్తే ఎందుకయ్యా..." అని డాక్టరుకు స్లిప్ టైపు చేయించి రాజుకు యిచ్చాడు.

రాజు సంబరపడ్డాడు. ఎప్పటినుంచో తనూ డాక్టరు దగ్గరకు వెళ్లాలనే అనుకుంటున్నాడు. "మీ దయండీ..." అంటూ చీటీ పుచ్చుకున్నాడు. రాజుకు అన్ని సదుపాయాలూ చేయమని సెక్రటరీని పిలిచి రాజుముందే ప్రెస్ చేస్తూ చెప్పాడు. రాజు ఉబ్బి తబ్బిబ్బయ్యాడు.

ఏ.సి. రూమ్‌లోకి పోయి స్థిమితంగా కూర్చొని డాక్టర్‌తో అతను ఏమి మాట్లాడాడో ఎవరికి తెలుసు!

మరునాడు రాజుకు టి.బి. అన్న రిపోర్టు ఆఫీసుకు చేరింది. సైట్లీ ఎటాక్డ్. చాలు. దాని ఆధారంగా బాట్లింగ్ కంపెనీలలో క్షయవ్యాధి గ్రస్తులు పనిచేయకూడదన్న మిషతో, కంటేజియస్ డిసీజ్ ఉన్న వర్కర్స్‌ని పని చేయనీయ కూడదన్న ఫ్యాక్టరీ రూల్సు ప్రకారం రాజుకు ఉద్వాసన చెప్పక తప్పలేదు.

తీసేస్తూ రాజును చూసి సత్యమూర్తి "నీకెప్పుడు ఏది కావలసినా నన్నడుగు, ఎన్నాళ్ళోయ్... మళ్ళీ నెల్లాళ్ళల్లో నీ పనిలో నువ్వుంటావ్" అన్నాడు.

సత్యమూర్తిని మామగారు మరోసారి అభినందించారు. లేబరు గొడవలేమీ రాకుండా యింత చక్కగా వ్యవహారం చక్కదిద్దినందుకు మరీ మరీ కొనియాడారు.

కాని ఈ ఆనందం పట్టుమని పది రోజులు నిలవలేదు. రాజు మరో కంపెనీలో ఎక్కువ జీతానికి ఉద్యోగానికి కుదిరాడు!

సత్యమూర్తి ముఖం పాలిపోయింది. ఆకాశం యింత విశాలంగా ఎందుకుంది అనుకున్నాడు. దాన్ని చించి ముక్కలు ముక్కలు చేసి పీసెస్ కింద, చిన్న చిన్న నలుసులు కింద చేసెయ్యాలనుకున్నాడు. కాని అది మరో ఆకాశం!

(ఆంధ్రజ్యోతి, 6.8.1982)